


దుగ్గయ్యవాళ్ళ ఊరు తిరిగివచ్చాడు. ఇంటికి వచ్చేందుకు పోలీసువాళ్లు తబ్బిచ్చారు. ఇంటికెందుకనుకున్నాడు అక్కడ యిల్లేముంది? ఉందో లేదో? ఎవడికి తెలుసు? పుట్టినఊరికి ఒక వ్యక్తికి అంత సంబంధం ఏమిటి? అది వాళ్ళ ఊరంటారు. వాడుకూడా మాఊరంటాడు. పూర్వకాలంలో ఆ సంబంధం ఉండేదేమో! ఆ ఊళ్ళో పుట్టినవాణ్ణి ఆ ఊరు పోషించాలి. పూర్వం పోషించేది కాబోలు. నేను ఆ ఊళ్ళో పుట్టాను అనడేం? మాది ఆ ఊరు అంటాడు. వట్టి పాతమాట. వాళ్ళది ఆ ఊరైతే అక్కడికి పంపించాలిగాని వాడు అక్కడ పుట్టినంతమాత్రం చేత అక్కడికి పంపాలసిన అవసరంలేదు. కాని దుగ్గయ్య నక్కడకు పంపించారు.

వాళ్లు పంపించారు సరే దుగ్గయ్య యెందుకు వెళ్లాడు? ఇంకొకచోటికి వెళ్లకపోయాడా? ఆ దోషం దుగ్గయ్యలోకూడా ఉంది. తానక్కడ పుట్టాడు గనుక అక్కడ పెరిగాడు గనుక అది తన ఊరనుకొన్నాడు అది యొక వ్యామోహం అందామా? సత్తుడులో సహజంగా ఉన్న లక్షణ మనుకొందామా?

ఊరంటే రెండు లక్షణాలు. ఒకటి కొంత భూమి. రెండు కొన్ని యిళ్లూ, అందులో ఉండే జనం. అక్కడి యిళ్లు తలా ఒకళ్ళవీను, అక్కడ భూమి అక్కడున్నవాళ్ళకి తలా కాస్తా ఉంది. వాళ్ల యెవళ్ళ యిళ్ళల్లోనూ తానుండటానికి వీలులేదు, ఆ పొలాలకీ తనకూ సంబంధం లేదు, అయినా దుగ్గయ్య ఆ ఊరెందుకు వెళ్లాడు? తనదికాని భూమితో తనకొక సంబంధం ఉందా? "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న మాట యెంత నిజం, నిజంకాదు, ఎందుచేతనంటే? అక్కడి మనుష్యులకీ దుగ్గయ్యకూ ఏమీ సంబంధంలేదు. అక్కడున్న మట్టిమీదకూడ స్వామ్యం లేదు దుగ్గయ్యకు. అటువంటి మట్టిని పురస్కరించుకొని దుగ్గయ్య ఆ ఊరు వెళ్ళాడు, అది తన ఊరని దుగ్గయ్యకు ఉద్దేశ్యం ఉన్నది. ఊరంటే దేశమన్నమాటేగా.

దుగ్గయ్య ఆ ఊరు వదలిపెట్టి యిరవైయెనిమిదేళ్ళయింది. ఇప్పుడితనికి యెనభైయేండ్లున్నవి. ఈ యిరవైయెనిమిదేళ్లు ఖైదులోనున్నాడు. దుగ్గయ్యకు ఆ ఊరేమిటి చెరసాలకు బయట నున్న సర్వప్రదేశము తనదేనని యున్నది. ఆ లెక్కలో చాలారోజులు తానక్కడ ఉన్న ఊరు తనదేననిపించటంలో ఆశ్చర్యమేముంది?

అక్కడ పూర్వం దుగ్గయ్యకు చిన్నయిల్లు, రెండెకరాల కొండ్ర ఉండేది. దుగ్గయ్య అక్కడ తనకు ఏభైరెండేళ్లు వచ్చేవరకు నివాసంచేశాడు.



నేను చాలా గ్రామాలలోనూ, సినిమాలలోనూ నటించాను. "పల్నాటి యుద్ధం"లో నా నటన చూసి అంతా స్టన్ అయిపోయారంటే- మరి నమ్మి పెళ్ళాడేశాయి.

---

ఆ పేదవాడి కెవ్వరూ పిల్ల నివ్వలేదు, తన తల్లిదండ్రుల కతడొకడే కొడుకు. ఒక చిన్న గుడిసె ఉన్నది, ఆ పొలం ఉన్నది ఊరున్నది, కూలీ నాలీ చేసేవాడు. ఒంట్లో సత్తువ ఉన్నన్నాళ్ళు సరిపోయింది. అతనికి ముప్ఫై అయిపోగవచ్చేట పెండ్లి అయింది. తరువాత యిద్దరు కొడుకులు పుట్టారు. అతనికి యేభై యేళ్ళప్పుడు భార్య చచ్చిపోయింది. ఇద్దరి కొడుకులకీ పెద్దవాడికి పదేళ్ళు రెండవవాడికి ఏడేళ్ళు. భార్య చచ్చిపోయిన తర్వాత దుగ్గయ్యకు శక్తి ఉడిగిపోయింది. పాలిపుగా ఉందామంటే ఓపికలేదు. వ్యాధిగ్రస్తుడైనాడు. కూలీనాలీకీ పోవటానికి కడు పేదదశం. పోయినా దినుసు గింజలు నాళ్ళూ. పైగా పిల్లల్ని పోషించాలి, రెండేళ్ళు ఇబ్బంది పడ్డాడు.

తా నింక పిల్లల్ని పోషించలేడు. తానూ బ్రతకలేడు. రెండునెలలు చాలా గుంజాటన పడ్డాడు. అతని యాతనలో ఆలోచనలు తిరిగినై. చివరకు ఒక్కమార్గం తప్ప ఇంకొక మార్గం కనిపించలేదు. పిల్లల్ని చంపి వేసి తానూ చచ్చిపోతే సరిపోతుంది.

ఎక్కడనుంచో ఒక యినుపముక్క సంపాదించాడు. ఒకరోజున రాత్రి యిద్దరు పిల్లల్ని దానితో చంపాడు, వాళ్ళ యేడుపులకు ప్రక్కయిళ్ళవాళ్ళు మేలుకొన్నారు. అతను పొడుచుకో పోయేటప్పటికి పట్టుకుని ఆపారు.

అతనికి మొదట ఉరిశిక్ష వేశారు. తరువాత రాచరికంవాళ్ళు ఏమనుకొన్నారో అన్నం పెట్టవలసిన బాధ్యత మనది గదా? మనం పెట్టలేదు. కనుక ఈ చంపటానికి కారణం మనం. మనలను మనం చంపుకుంటామా? మనల్ని మనం శిక్షించుకొంటామా" అని ఆలోచించారో మరి యేమి ఆలోచించారో తెలియదు. ఆ ఉరిశిక్ష తొలగించి యావజ్జీవకారాగారం వేశారు. వేసినవాళ్ళు చచ్చేదాకా అతణ్ణి ఉంచుతారా? ఖైదు రోజుల్లో మినహాయింపులూ గట్రా చేసి యిప్పుడతనిని వెళ్ళిపొమ్మన్నారు. ఇప్పుడతను పొడుచుకు చద్దామంటే యినుపముక్క యెక్కడ దొరుకుతుంది? ఇనుము ప్రియమైపోయి కనిపించటంలేదు. కాలవల్లో పడిచావచ్చు. అది మార్గంగా కన్పిస్తున్నది.

దుగ్గయ్య తన ఊరువచ్చాడు. తానెరిగిన వాళ్ళెవరూ ఆ ఊళ్ళో లేరు. తన యీడువాళ్ళందరూ చచ్చిపోయినారు. ఊళ్ళల్లో ఉన్నవాళ్ళు పెందరాళే చచ్చిపోతారు. ఖైదుల్లో ఉన్నవాళ్ళు చాలారోజులు బ్రతుకుతారు కాబోలు!

దుగ్గయ్యని చూచి ఆ ఊరు నిన్ను నే నెరుగనన్నది. ఊరు బలిసింది. మంచిదే. ఎందుకు కాదు? దుగ్గయ్య కాల్వల్లోపడి చద్దామంటే పది కోసులు నడిచిపోవాలి. ఇక్కడికి వచ్చేటప్పటికే అతని పని అయిపోయింది. మరి యింకేం చేయాలి?